
# మనిషికో మతిమరుపు మహిలో సుమతీ!



.... అని అన్నారెవరో! ఎవరా అని చాలాసేపు ఆలోచించాను గానీ ఎంత ఆలోచించినా గుర్తురాలేదు, మర్చిపోయాను.

ఇంతకూ అసలీటాపిక్ ఎందుకొచ్చిందంటే నాకీ మధ్య మతిమరపు ఎక్కువయిపోతోందని మా భవానీశంకరం వార్నింగిచ్చాడు...

ఏ విషయంలో వాడికా అభిప్రాయం ఏర్పడిందో గాని మొత్తానికి వాడు నా మతిమరుపుకి విక్టిమ్ అయి ఉంటాడని మాత్రం ఊహించాను. ఆ రోజు నుంచి ప్రతి విషయం చాలా జాగ్రత్తగా అబ్జర్వ్ చేయడం ప్రారంభించాను. ఈ అబ్జర్వేషన్‌లోనే మతిమరుపనేది ఒక్కోమనిషికి ఒక్కో సబ్జెక్ట్‌లోనే ఏర్పడుతుందని అనుమానం కలిగింది. అంటే ఫలానా మనిషి ఫలానా విషయంలో మహా మతిమరుపుగా ఉంటాడు సుమా అనే కామెంట్ చేయాలిగానీ, "ఫలానావాడు వట్టి మతిమరుపు వెధవాయ్" అని ఎప్పుడూ జనరల్ స్టేట్‌మెంటియ్యగూడదు.

నేనిలాంటి నిర్ధారణకు రావడానికి పరిశోధించిన మా ఫ్రెండ్స్‌లో మొదటివాడు అప్పలాచారి.

పరిశోధన టేకప్ చేశాక ఆ మర్నాడే సికింద్రాబాద్ రైల్వేస్టేషనులో అప్పలాచారి కినిపించాడు. వాడు జనగామలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టరుగా చేస్తున్నాడు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడం చేత ఇద్దరం హస్కాలజీలో మునిగిపోయాం.

"ఉద్యోగం ఎలా వుంది" అడిగాను మధ్యలో.

"మొన్న భలే తమాషా జరిగిందిలే" అన్నాడు వాడు ఉత్సాహంగా.

"ఏమిటది?"

"నేను మామూలుగా నైట్ డ్యూటీలో మా స్టేషన్ బయట ప్లాట్‌ఫారం మీదున్న సిమెంట్ బెంచీ మీద దుప్పటి ముసుగుపెట్టి నిద్రపోతున్నాను. రాత్రి రెండింటికి సేఫ్టీ ఆఫీసర్ జీప్‌లో ఇన్‌స్పెక్షన్‌కొచ్చి- స్టేషన్ అంతా వెతికి - చివరకు నన్ను నిద్రలేపాడు. ఆయనను చూడగానే నాకు పరిస్థితి అర్ధమయిపోయింది. వెంటనే ఓ ఉపాయం ఆలోచించాను.

"డ్యూటీ స్టేషన్ మాస్టర్ నువ్వేనా?" అనడిగాడు కోపంగా.

"స్టేషన్ మాస్టరా? అర్థం కానట్లు అడిగాను.

"నువ్వు కాదా?"

"అహ్హాహ్హా-" అని నవ్వాను.

"ఏమిటలా నవ్వుతావ్!"

"లేకపోతే ఏమిటయ్యా! నేను పాసెంజర్‌ని! సికింద్రాబాద్ బండి కోసం వెయిట్ చేస్తున్నాను" అనేసి మళ్ళీ ముసుగెట్టేశాను. వాళ్ళు మళ్ళీ స్టేషన్‌లో కెళ్ళారు. అదే ఛాన్సనుకొని ఛటుక్కున లేచి పక్కబట్టలన్నీ కిందపడేసి, తల దువ్వుకొని, ఇన్‌షర్టు సరిజేసుకుని సిగరెట్ వెలిగించాను. అప్పుడు రెండు జేబుల్లో చేతులుంచుకుని "సరిగమలూ- పదనిసలూ" అని పాడుకుంటూ తిన్నగా ఆఫీసులోకొచ్చి వాళ్ళను చూసి ఆశ్చర్యపోయినట్లు ఓపరాక్షన్ చేసి, "గుడ్‌నైట్ సార్" అంటూ విష్ చేశాను. "ఇప్పుడే అలా సిగరెట్ వెలిగించుకుందామని ప్లాట్‌ఫారం మీద కెళ్ళాన్సార్" అని చెప్పేసరికి నమ్మేశారు.

నేనూ అప్పలాచారీ ఇద్దరం చాలా సేపు నవ్వుకున్నాం. ఆ సంఘటన తల్చుకుని, నెలరోజుల తర్వాత మళ్ళీ సికింద్రాబాద్‌లోనే బస్‌స్టాపులో కనిపించాడు. మళ్ళీ కుశల ప్రశ్నలయ్యాయి.

"రేపు రెస్టుకదా - అందుకని వచ్చేశాను" అన్నాడు.

"అలాగా!" అన్నాను.

"అది సరేగాని మొన్నామధ్య భలే తమాషా జరిగింది" అన్నాడు ఉత్సాహంగా.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను నైట్ డ్యూటిలో స్టేషన్ ఆఫీసు బయట బెంచిమీద పడుకుని ముసుగుపెట్టి నిద్రపోతూంటే రాత్రి రెండింటికి డి.యస్.వో. ఇన్‌స్పెక్షన్ కొచ్చాడు జీపులో. ఎస్.ఎమ్. ఆఫీసులో నేను కనిపించకపోయే సరికి బయటకొచ్చి నన్ను లేపాడు...." అదే కథ మళ్ళీ చెప్తున్నాడని అర్థమయిపోయింది నాకు. అయినా వాడు అంత ఉత్సాహంగా చెపుతోంటే అడ్డుపడడం బావుండదని ఓపిగ్గా అంతా విన్నాను.

ఆ తరువాత వారం రోజులకు వాడు కాచిగూడాలో కనిపించాడు మళ్ళీ.

"సేఫ్టీ కాంప్‌కొచ్చాన్లే! ఇంకో రెండు రోజులుంటాయి క్లాసులు" అన్నాడు తనక్కడ ఎందుకున్నదీ వివరిస్తూ.

"అన్నట్టు మొన్న భలే తమాషా జరిగిందిలే డ్యూటీలో" అన్నాడు మళ్ళీ.

నాకు కొంచెం భయం వేసింది మళ్ళీ అదే కథ చెప్తాడేమోనని.

"ఏమిటది?" అడిగాను అనుమానంగా. ఒకవేళ ఇప్పుడు చెప్పబోయేది మరో కొత్త సంఘటనేమో అన్న ఆశ అలా అడిగించింది నన్ను.

"నేను ఒకరోజు నైట్ షిఫ్ట్‌లో ఉండగా మా స్టేషన్ ఆఫీసు బయట బెంచీమీద ముసుగుపెట్టి నిద్రపోతున్నాను. సడెన్‌గా రాత్రి రెండింటికి జీప్‌లో డి.యస్.ఓ.నైట్ ఇన్‌స్పెక్షన్ కొచ్చి ఆఫీసులో ఎవరూ లేకపోయేసరికి అనుమానం వచ్చి నన్ను నిద్రలేపాడు. డ్యూటీలో నిద్రపోతే పనిష్మెంట్ ఉంటుంది గదా! అందుకని నేను ట్రిక్ ప్లే చేశా!"

ఆ తరువాత వినడానికి మనస్కరించలేదు నాకు. ఎంత రసవత్తరమయిన కథయినా చదివినకొద్దీ నీరసం పెరిగిపోతుంది కదా! అంచేత వెంటనే వాడి వాక్ ప్రవాహానికి అడ్డుపడిపోయాను.

"ఇదా! ఇది మొన్న కనబడినప్పుడు చెప్పావ్ కదురా" అన్నాను.

వాడు ఆశ్చర్యపోయాడు.

"చెప్పానా?" అన్నాడు నమ్మలేకపోతున్నట్లు.

"అవును!"

"ఎప్పుడు?"

"వారం క్రితం రెస్టులో వచ్చావ్ నువ్వు- అప్పుడు చెప్పావ్."

"ఓహో- చెప్పేశానన్నమాట!"

"అవును!"

"భలే తమాషాగా జరిగింది కదూ?"

"చాలా ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ ఉపయోగించావ్!" అన్నాను మెచ్చుకుంటూ. ఇద్దరం టూరిస్ట్ హోటల్లో 'టీ' తాగాం. వాడు చాలాసేపు రైల్వేయూనియన్ల గురించి మాట్లాడాడు.

"మా యూనియన్లు భలే తమాషా యూనియన్లురా! రైల్వే కార్మికులందరూ జీతాలు పెరగాలని సమ్మె చేస్తూంటే యూనియన్లు అక్కరలేదని సమ్మెను చెడగొట్టేశాయి" నేను ఆశ్చర్యపోయాను.

"అదేమిటి? అసలు జీతాల పెరుగుదల కోసం యూనియన్‌లే సమ్మె చేయించాలి కదా?" అడిగాను.

"అదేమరి రైల్వే లో ఫార్స్! ప్రపంచంలో ఎక్కడా యిలాంటి వింత ఉంటుందేమో చూడు."

"ఒకవేళ ఇప్పటికే జీతాలు చాలా ఎక్కువగా వున్నాయని మీ యూనియన్లు అలా చేశాయేమో?"

వాడు పగలబడి నవ్వాడు.

"జీతాలు ఎక్కువా? నీకు తెలీదేమో. మా గుమాస్తా బేసిక్ ఎంతో తెలుసా? రెండువందల అరవై- మరి స్టేట్ గవర్నమెంట్‌లో ప్యూన్ బేసిక్ రెండువందల తొంభై-"

ఇద్దరం చాలా రోజుల తరువాత మనసారా నవ్వుకున్నాం.

"అది సరేగాని మొన్న భలే ఫార్స్ జరిగింది తెలుసా?" అనడిగాడు వాడు. నాకు భయం ముంచుకొచ్చింది.

"ఏమిటిది?"రిస్కు తీసుకునే అడిగాను. ఎందుకంటే ఆపాత కథ నాకు అంతకుముందే చెప్పబోవటం- నేను తెలుసునని వారించటం వాడప్పుడే ఎలా మర్చిపోతాడా అని ఓమూల మిణుకుమిణుకు మనే ఆశ!

"ఓ రోజు నేను నైట్ డ్యూటీలో వుండగా ఏమయిందంటే- బయట ఉన్న సిమెంట్ బెంచీమీద..."

"ఇది చెప్పావ్ కదురా!" అన్నాను హడావుడిగా అడ్డుపడి.

"చెప్పానా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవున్రా!"

"ఎప్పుడు?"

"క్రిందటివారం నువ్ రెస్ట్‌లోవచ్చినప్పుడు"

"ఏదీ- మా డి.యస్.ఓ.నైట్ ఇన్‌స్పెక్షన్‌కి రావడం- నేను పాసింజర్‌లాగా నటించడం.

"అవున్రా- ఇదే చెప్పావ్! మీ డి.యస్.వో. నీ మాటలు నమ్మి వెళ్ళిపోవడం - అంతా చెప్పావ్."

అప్పటికి గానీ వాడికి సంతృప్తి కలుగలేదు.

వాడు వెళ్ళిపోయాక గానీ నాకు గుర్తు రాలేదు. అది వాడి తాలూకూ మతిమరుపు సబ్జెక్టు అన్నమాట- మిగతా విషయాలేమీ మర్చిపోవడంలేదు వాడు. మిగతా విషయాలేమీ చెప్పినవే చెప్పడం జరగటం లేదు. కేవలం వాడి డ్యూటీలకు సంబంధించిన సంఘటనలే- చెప్పిందే చెప్పడం జరుగుతోంది.

తరువాత చాలాసార్లు కనిపించాడు అప్పలాచారి. కనిపించినప్పుడల్లా ఆ సంఘటనే చెప్పడాన్కి ప్రయత్నించడం - నేను కెవ్వున కేకవేసి వాడికి అడ్డుపడడం జరుగుతూనే వుంది. ఆ తరువాత నేను స్టడీ చేసిన మరో కేస్ మా రాజారామ్.

ఆతనికి లక్ష వ్యవహారాలు. రైల్వేలో టీటీఇ ఉద్యోగం అవడం చేత రిజర్వేషన్‌ల కోసం అనుక్షణం ఇంటిచుట్టూ తిరిగే బంధుమిత్రులూ- అతను స్టేజీ ఆర్టిస్ట్ అవడం చేత

తరచుగా కలుసుకోడానికొచ్చే నటీనటులు, డైరెక్టర్లు, సమాజాలు, డ్రామాల రిహార్సల్స్, రేడియో ప్రోగ్రాములు, ఇన్ని వ్యవహారాల్లో ఇరుక్కోవడం చేత, ఓ కొత్తరకం మతిమరపు వచ్చేసింది. ఓరోజు ఏదో పనిమీద అతనింటికి వెళ్ళాను.

"అబ్బబ్బబ్బ! నీ కోసం వారం రోజుల్నుంచి ట్రై చేస్తున్నాను" అన్నాడతను.

"ఏమిటి సంగతి?"

"రేడియోలో మా కల్చరల్ అసోసియేషన్ నాటకం రికార్డింగ్ ఉందివాళ! దాని కోసం అర్జంటుగా పావుగంట స్క్రిప్ట్ కావాలి. మీ కాలనీ రైటర్‌తో రాయించి ఇవ్వకూడదూ?"

"రికార్డింగ్ ఇవాళా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును!"

"ఇవాళెలా కుదుర్తుంది? స్క్రిప్టు ఎప్పుడు రాస్తాడు? ప్రాక్టీస్ ఎప్పుడు చేస్తారు?"

"ఏదోకటి- ఎలాగోలా లాగించెయ్. బాబ్బాబు!"

"మరి నేను నాలుగురోజుల క్రితం కనిపించినప్పుడైనా చెప్పలేదే ఈ విషయం?

"నాలుగు రోజుల క్రితం కనిపించావా నువ్వు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. సంగీత్ థియేటర్ దగ్గర కనిపించలేదూ?"

"సంగీత థియేటర్ దగ్గరా? నేనక్కడికెళ్ళిన గుర్తులేదే?" గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

పావుగంట టైమ్ గడిచిపోయింది గానీ గుర్తుకురాలేదు.

"సరే, ఆ సంగతి వదిలేయ్. ఇప్పుడేం చేయమంటావ్?"

"రేప్పొద్దున్నకల్లా స్క్రిప్టు రాయించు! చాలు. నేను రేడియో స్టేషన్‌కి ఫోన్ చేసి మన ప్రోగ్రామ్ రికార్డింగ్ ఎల్లుండి పెట్టమని రిక్వెస్ట్ చేస్తాను."

"సరే' వప్పుకున్నాను.

ఆ రాత్రి చాలాసేపు తంటాలు పడి స్క్రిప్ట్ రాయించి మర్నాడు ఉదయం తీసుకెళ్ళి రాజారామ్ కిచ్చాను.

"ఏమిటిది?" అడిగాడు స్క్రిప్టు తీసుకుని.

"నాటిక."

"నాటికా-"

"అవును,"

"ఎందుకిది!"

నాకు అర్థమయిపోయింది- ముందురోజు చెప్పినదంతా మర్చిపోయాడని.

"ఆదేనయ్యా! రేడియో రికార్డింగ్‌కి కావాలన్నావ్ కదా?"

"మై గాడ్!" అంటూ అదిరిపడి లేచి నుంచున్నాడు.

"ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాను.

"రికార్డింగ్ రేపటికి పోస్టుపోన్ చేయమని రేడియో స్టేషన్‌కి ఫోన్ చేయడం మర్చిపోయాను నిన్న."

నేను అదిరిపడ్డాను.

"అయితే నిన్న వాళ్ళు ఎదుర్చూసి ఉంటారు పాపం."

"అవును ఓ పని చేద్దాం! సాయంత్రం నాలుగుసార్లు రిహార్సల్స్ వేసుకుని రేపు ఉదయం రేడియో స్టేషన్‌కి డైరెక్ట్‌గా వెళ్ళి రెక్వెస్ట్ చేస్తే రికార్డ్ చేసేస్తారు" అన్నాడు.

"ఐడియా బాగానే ఉంది" అన్నాను.

"బాబ్బాబు- ఏమీ అనుకోకుండా సాయంత్రం బోయిగూడా ఇన్‌స్టిట్యూట్ కొచ్చేయ్. నువ్వా ఓ కారెక్టర్ వేద్దుగానీ- ఇప్పటికిప్పుడు ఆరుగురు ఆర్టిస్టులను వెతికి పట్టుకోవాలంటే కష్టం! మిగతా వాళ్ళను ఎలాగోలా ఆటోలో తిరిగి లాక్కొస్తాను" అన్నాడు.

"సరేనని నేను సాయంత్రం అయిదింటికల్లా బోయిగూడా ఇన్‌స్టిట్యూట్ దగ్గరకు చేరుకున్నాను.

అక్కడ రెడ్డి దిగాలుగా కూర్చుని కనిపించాడు.

"ఏంటి అప్పుడే వచ్చేశావ్?" అడిగాతనిని.

"రెండింటికి రిహార్సల్ అన్నాడు కదా రాజారాం"

"రెండింటికా?"

"అవును గురూ! మధ్యాహ్నం రెండింటికి రిహార్సల్స్ అని చెప్పాడు- అప్పటినుంచీ కూర్చున్నాను."

"నాకు అయిదింటికని చెప్పాడే?" అన్నాన్నేను.

ఇద్దరం కలిసి ఆరున్నరవరకూ చూసి నడుచుకుంటూ రాజారామ్ ఇంటికి చేరుకున్నాం. ఇంట్లోలేడతను. ఎక్కడికో పొద్దున్ననగా వెళ్ళాడట! ఆ తరువాత ఎవరికీ కనిపించలేదు. మేము చాలా సేపు అక్కడే తచ్చట్లాడి ఎనిమిది గంటలకు ఇళ్ళకు బయలుదేరాం!

దారిలో స్వామి, కుమార్ ఎదురయ్యారు - "రిహార్సల్‌కి రాలేదేమిటి?" అడిగారు వాళ్ళు.

"రిహార్సల్స్‌కు రాకపోవడమా?" ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

"అవును మీరూ లేరు- రాజారామ్ లేడు."

"అదేమిటి? మేమిప్పటివరకూ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఎదుర్చూసి ఇంతకుముందే తిరిగివచ్చాం" అన్నాను.

"ఇన్‌స్టిట్యూట్ కెందుకెళ్ళారు? రిహార్సల్స్ ఎకౌంట్స్ ఆఫీస్ కాంటీన్‌లో గదా?" అడిగారు వాళ్ళు.

"అంటే మీతో రిహార్సల్స్ ఎకౌంట్సు ఆఫీస్ కాంటీన్‌లో అని చెప్పాడా?"

"అవునూ! మీకలా చెప్పలేదా?"

"లేదే-"

అందరం పావుగంట సేపు నిశ్శబ్దంగా నిలబడి ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నాం. మర్నాడు అందరం కలసి రాజారామ్ ఇంటికెళ్ళాం!

"ఇవాళ్ళేదో పెద్ద విశేషం ఉన్నట్లుంది అందరూ కలిసివచ్చారు!" అన్నాడు రాజారాం నవ్వుతూ!

"నిన్న రిహార్సల్స్ సంగతేమిటి?" అడిగాను చాలా శాంతంగా.

"రిహార్సల్సా? ఏ రిహార్సలు?" తనూ అంతకంటే శాంతంగా అడిగాడు.

"నిన్న మా ఇద్దరినీ ఇన్‌స్టిట్యూట్‌కీ, వాళ్ళిద్దరినీ ఎకౌంట్స్ ఆఫీస్‌క్యాంటీన్‌కీ రమ్మన్నావ్ కదా- ఆ రిహార్సలు... "

"అడెడెడెడెడె...." అంటూ నాలిక్కరుచుకున్నాడతను.

"ఆ ఎక్స్‌ప్రెషన్‌కి అర్థం ఏమిటి?"

"ఆ సంగతే మర్చిపోయాను- అయామ్ సారీ!"

"మరి నిన్న సాయంత్రం ఎక్కడికెళ్ళావ్?"

"వేరే అసోసియేషన్ వాళ్ళు ఓ నాటకంలో చిన్న కారెక్టర్ వేయమని బ్రతిమాలి తీసుకెళ్ళారు."

"మరి మన రేడియో నాటిక సంగతేమిటి?"

"దాన్దేముంది? అందరం ఇప్పుడే రేడియో స్టేషన్‌కెళ్ళి రెక్వెస్ట్ చేస్తే రికార్డింగ్ జరిగిపోతుంది. అంతగా కావాలంటే అక్కడే ఓ రిహార్సల్ వేసుకోవచ్చు."

అందరం రేడియో స్టేషన్‌కి చేరుకున్నాం.

ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ దగ్గరకెళ్ళి సారీ చెప్పి జరిగిందంతా వివరించాడు రాజారాం.

అంతా విని ఆయన "కంట్రాక్ట్ ఏది చూపించండి!" అన్నాడు.

కంట్రాక్ట్ తీసి చూపించాడు శాయిరాం.

"ఇది కిందటి నెల తాలూకూ కంట్రాక్ట్ నాయనా! మీరు అంతులేక పోవడం వల్ల ఇంకెవరిదో ప్రోగ్రాం చేసేశాం."

రాజారాం ఆత్రుతగా కంట్రాక్ట్ లాక్కుని చూశాడు. నిజమే! రికార్డింగ్, బ్రాడ్‌కాస్టింగ్ రెండు తారీఖులూ క్రిందటి నెలవే!

అందరం మరోసారి సారీ చెప్పి ఇంటికి తిరిగి వచ్చాం.

ఇంటిదగ్గర రాజారాం వాళ్ళ తమ్ముడు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు.

"అదేంటన్నయ్యా- ఇంతలేటుగా వచ్చావ్, మద్రాస్ ఎక్స్‌ప్రెస్ డ్యూటీకదా నీది-"

రాజారాం అదిరిపడి టైమ్ చూసుకున్నాడు.

"కొంప మునిగింది. ఆ సంగతే మర్చిపోయాను. బండి ఎప్పుడో వెళ్ళిపోయుంటుంది. ఇప్పుడెలా?" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఇంకేముంది. త్వరగా రైల్వే హాస్పిటల్‌కు వెళ్ళి సిక్ చేసేయ్?" సంహా ఇచ్చాడు సుబ్బారెడ్డి. అప్పటికప్పుడు హాస్పిటల్‌కు బయల్దేరి వెళ్ళాడు రాజారాం. మరో రెండు రోజుల తర్వాత కనిపించినప్పుడు ఎవరితోనో మళ్ళీ ఏదో నాటిక గురించి మాట్లాడుతున్నాడు. "లేదన్నా! నన్ను నువ్వు రిహార్సల్‌కి ఎనిమిదింటికే రమ్మన్నావ్! లేకపోతే ఎనిమిదింటి కెందుకొస్తాను?"

"కాదయ్యా బాబూ! నేను ఆరింటికే రమ్మన్నాను– నీ మూలాన రిహార్సల్ కాన్సలయిపోయింది..." అంటున్నాడు రాజారామ్.

ఆ తరువాత నేను స్టడీ చేసిన కేసు ఓ రచయిత ఫ్రెండ్‌ది. ఆయనకు సర్వస్వం తారీఖులతో సహా గుర్తుంటాయి గాని, కథా రచయితగా అభిమానులు, నాటక రచయితగా సమాజాల సభ్యులు, ఎక్కువ సంఖ్యలో ఉండటం మూలాన తక్కువ పరిచయం ఉన్న వాళ్ళను ఇట్టే మరచిపోతుంటాడు.

ఓ సారి నేనూ ఆ రచయితా వెళ్తొంటే ఓ పెద్దమనిషి స్కూటర్ మీద ఎదురయి 'హలో' అంటూ పలకరించి స్కూటర్ ఆపాడు.

"హలో హలో" అన్నాడు రచయిత.

అతను స్కూటర్ రోడ్డు పక్కకు లాగి స్టాండ్ వేస్తూ "ఇతనెవరో ఎంత తన్నుకున్నా గుర్తుకురావటం లేదే!" అన్నాడు నాతో నెమ్మదిగా.

"దాన్దేముంది? అతనినే అడిగేస్తే సరి–"

"అబ్బే, హర్టయిపోతాడు. అలా బాగుండదు."

"మరేం చేస్తావ్?"

"మాటల్లో పెట్టేసి వివరాలు లాగేస్తే దొరికిపోతాడ్లే–" అన్నాడు ధైర్యంగా.

"బాగున్నారా?" అన్నాడతను దగ్గరకొచ్చి.

"ఓ! ఆల్ ఓకే!" అన్నాడు మావాడు.

"ఇంకా అదే ఆఫీస్‌లో ఉన్నారా?" అడిగాడతను.

"అవునండీ! అక్కడే! అక్కడే!– ఇంకెక్కడికి పోతాం?"

"మనం కలిసి చాలాకాలం అయిపోయింది" నవ్వుతూ అన్నాడతను.

"అవును! చాలా రోజులయింది! నిజమే! మీరు అదే ఆఫీసా, లేక మరెక్కడికయినా మారారా?" అడిగాడు ఆచూకీ కోసం ప్రయత్నిస్తూ.

"మా ఆఫీసు ఒక్కటే కదండీ సిటీలో – ఇంకెక్కడికి మార్తాము?"

"హ్హా హ్హా హ్హా! అవునవును! నిజమేననుకోండి– ఒకోసారి ప్రమోషను అవీ రావచ్చు కదా."

"మీకా భయమేమి అఖ్ఖర్లేదు. నేనీపోస్టులోనే రిటైరయిపోతాను! మీ కథలు పత్రికల్లో కనిపించినప్పుడుల్లా - నేనూ మా మిసెస్- మిమ్మల్ని గుర్తుచేసుకుంటూంటాం!" అన్నాడతను.

"ఓ అలాగా - అహహ-"

"ఒకసారి మా ఇంటికి డిన్నర్‌కి తీసుకురమ్మని మా తమ్ముడు కూడా గొడవ చేస్తున్నాడు."

"ఓ- తప్పకుండా వస్తాను- తప్పకుండా వద్దాం."

"మా ఇల్లు మీకు గుర్తుండే ఉంటుంది. రెండుమూడు సార్లు వచ్చారు కదా!"

"ఆ ఆ! బాగా గుర్తుంది-" అప్పటికే మావాడి మాటలు తడబడుతున్నాయి.- ఇల్లయితే ఈ మధ్యలో మారలేదు కదా?"

"లేదు-"

"అదీ గాకుండా ఇంటిముందు మీ నేమ్ ప్లేట్ ఎలాగూ వుంటుంది కదా? అన్నట్లు ఫుల్ నేమ్ రాసి ఉంటుందా?" అఖరుసారి అతనిపేరు తెలుసుకోవడం కోసం ఓ ప్రశ్న వదిలాడు

"భలేవారే! కొట్టిచ్చినట్టు కనబడుతూంటుంది-"

"మీ అసలుపేరు- అంటే పూర్తి ఇంటిపేరుతో వుంటుందా? లేక షార్ట్ ఫారమ్ వుంటుందా?"

"పూర్తి పేరే వుంటుందిలెండి! ఒక్క నిమిషం!" అంటూ పక్కనే వున్న దుకాణంలో అగ్గిపెట్టి కొని సిగిరెట్ వెలిగించుకోసాగాడు.

"ఇతనెవరో ఎంత ప్రయత్నించినా తెలియటం లేదే!" అన్నాడు మావాడు.

"ఇంక అడిగెయ్యటమే మంచిది-" సలహా ఇచ్చాన్నేను.

"ఇంతసేపు మాట్లాడాక ఇప్పుడా అడగడం? ఇంకేమయినా వుందా!" కోప్పడ్డాడు వాడు. అతను మళ్ళీ దగ్గరకొచ్చాడు.

"అయితే ఓ పని చేయండి గురూజీ. ఎల్లుండి ఆదివారం మా ఇంటికి భోజనానికి వచ్చేయండి."

"ఆ! ఎల్లుండా?" గతుక్కుమన్నాడు మావాడు.

"అవును-ఏం?"

"ఆ! మరేంలేదు. కానీ ఎల్లుండి కొంచెం పనుంది."

"అలాగా! అయితే సరే మీ ఇష్టం! మీకెప్పుడు వీలుంటే అప్పుడు."

"ఓ యస్! నేనే మీకు ఫోన్ చేసి చెపుతాన్లెండి- మీ ఫోన్ నెంబరేమిటి?"

అతను ఫోన్ నంబర్ ఓ కాగితం మీద రాసి ఇచ్చాడు.

"ఈ నెంబర్‌కి ఫోన్ చేసి నా పేరు చెపితే పిలుస్తారు! నో ప్రాబ్లమ్ మరి నేను

వెళ్ళిరానా,"

"ఆ! అలాగే! థేంక్యూ!"

అతను వెళ్ళిపోయాక మా రచయిత వెధవనవ్వు నవ్వాడు.

"దెబ్బ తినేశాను గురూ! ఫోన్ నంబర్ అడిగినప్పుడయినా పేరు కూడా రాస్తాడనుకున్నాను."

ఇలాంటి సంఘటనలు మా రచయితతో పాటు చాలా అనుభవంలో కొచ్చాయి నాకు. ఇక మిగిలింది రెడ్డి.

రెడ్డి ఫార్మాసిస్ట్, డిస్పెన్సరీలో మందులూ వగైరా ఖచ్చితంగా గుర్తు పెట్టుకునే ఇస్తాడు అందరికీ. అందులో ఏ ధోకా లేదు. అక్కడే మతిమరుపూ లేదు. ఎటొచ్చీ ఆయన మతిమరుపేంటంటే ఎవరి దగ్గరయినా తీసుకున్న వస్తువు గురించి మర్చిపోవడం.

ఓ పేషెంట్ దగ్గర తీసుకున్న బాల్‌పెన్ మరో పేషెంట్‌కి బలవంతంగా ఇచ్చి పంపించేసిన సంఘటనలు కోకొల్లలు. తనెప్పుడయినా పెన్‌గానీ, బాల్‌పెన్‌గానీ కొంటే– కేవలం కొద్దిగంటలు మాత్రమే అతని దగ్గరుంటాయ్! ఆ తరువాత ఇక వెతకడమే పని! ఒక్కోసారి అతని దగ్గర పది పదహేను బాల్‌పెన్‌లు చేరిపోతాయ్. ఏది ఎవరి దగ్గర తీసుకొన్నాడో గుర్తుండదు. ఏది ఎవరికి రిటర్న్ చేయాలో తెలీదు.

ఓ సారి నాకో ఖరీదయిన బాల్‌పెన్న్ తెచ్చిచ్చాడు.

"చాలా బాగుంది." అన్నాను నేను–నాకు చూపించడానికి తెచ్చాడనుకొని.

"అవును. ఎక్కడ కొన్నావ్?" అడిగాడు.

"నేను కొనడమేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నువ్వు కొనలేదా ఇది?" ఇంకా ఆశ్చర్యంగా అడిగాడు.

"అబ్బే ఇదసలు నాదికాదు–"

"నీది కాదా?"

"నేను నీకెప్పుడూ బాల్‌పెన్ ఇవ్వలేదు."

"అదేమిటి నిన్న ఉదయం మీ ఇంటికొచ్చినప్పుడు రాసుకోడానికి ఇచ్చావ్ కదా?" అడిగాడు అయోమయంగా.

"నేనివ్వలేదు. నేను కొత్తగా రికార్డ్ చేసిన పాటల కేసెట్ అడిగి తీసుకెళ్ళావ్. అంతే! ఇంకేం తీసుకోలేదు–"

"ఏమిటి? పాటల కేసెట్ మీది తీసుకెళ్ళానా?" ఇంకా ఆశ్చర్యపోతూ అడిగాడతను.

"నిన్నే కదా తీసుకెళ్ళావ్ అప్పుడే మర్చిపోయావా?"

"కాసెట్ నేను యోగిబాబు నడిగి తీసుకెళ్ళాను కదా!"

"కాదు గురూ! నా దగ్గరే తీసుకెళ్ళావ్!"

"మరి నేనివాళ పొద్దున్న అది యోగిబాబుకిస్తే అబ్బ ఎన్నాళ్ళకు తిరిగి ఇచ్చావురా

అని తీసుకున్నాడే?"

"అయ్యో కొంపముంచావ్ గురూ! అది నాది! పద- వెళ్ళి యోగిబాబుని కనుక్కుందాం! లేకపోతే గోవిందా అయిపోతుంది."

ఇద్దరం యోగిబాబు ఇంటికెళ్లాం.

"ఒరేయ్- ఇవాళ నీకిచ్చిన కాసెట్ ఇతనిదంట్రా! నీదికాదు" అన్నాడు రెడ్డి.

"నాకు కాసెట్ ఇచ్చావా?" ఆశ్చర్యంగా అడిగాడు యోగిబాబు.

"అదేమిట్రా! ప్రొద్దున్న వచ్చినప్పుడు నీకు కాసెట్ ఇవ్వలేదూ? అబ్బ ఎన్ని రోజులకు తిరిగిచ్చావురా అని తీసుకున్నావ్!" రెట్టిస్తూ అడిగాడు రెడ్డి.

"నీ తలకాయ్!"

"అంటే?"

"పొద్దున్న ఇక్కడికొచ్చినప్పుడు నువ్వు నాకిచ్చింది గొడుగు."

"గొడుగేమిటి?"

అదే నాకూ అర్థం కాలేదు. ఒకవేశ నా గొడుగుఎప్పుడయినా పట్టుకెళ్ళి ఇన్ని రోజులకు తెచ్చి ఇచ్చావేమోనని తీసుకున్నాను. తీరా నువ్వు వెళ్ళాక చూస్తే మా గొడుగు మా ఇంట్లోనే ఉంది. దీనిమీద ఇంకెవరివో ఇనీషియల్స్ ఉన్నాయి చూడు" అంటూ గొడుగు తెచ్చి రెడ్డికిచ్చాడతను. అందరం కలసి ఆ అక్షరాలు చదివాం.

పి.యస్.ఎల్. అనే అక్షరాలున్నాయ్.

"అంటే ఎవరయి ఉంటారు?" అన్నాడు రెడ్డి ఆలోచనలలో పడుతూ.

"ఇంతకూ నా కాసెట్ ఏమయినట్లు?" అన్నాన్నేను భయంగా.

"అదిసరే! క్రికెట్ స్కోర్ విని ఇస్తానన్నావ్ కదా, నా ట్రాన్సిస్టరేమయంది?" అనడిగాడు యోగిబాబు. రంగారెడ్డి షాకయ్యాడు.

"నీ దగ్గర ట్రాన్సిష్టర్ తీసుకున్నానా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్న మధ్యాహ్నం తీసుకున్నావు కదరా?"

"అవును! మళ్ళీ సాయంత్రం ఇచ్చేశాగా?"

"నా కెక్కడిచ్చావురా?" అదిరిపడుతూ అన్నాడు యోగిబాబు.

రెడ్డి కాసేపు ఆలోచించి "ఇదిలా తేలదు గానీ పదండి హాస్పిటల్ కెళ్దాం" అన్నాడు. అందరం కలిసి డిస్పెన్సరీ కెళ్ళాం.

అప్పటికే ఇద్దరు నర్సులు రెడ్డి కోసం ఎదురుచూస్తున్నారక్కడ.

"నా గొడుగు కోసం వచ్చాను" అంది ఒకామె.

"చంపావ్ తల్లీ! ఈ గొడుగు నీదా- ఇదిగో తీసుకో" అంటూ తన చేతిలోని గొడుగు ఆమె కిచ్చాడతను.

ఆమె కెవ్వున అరచింది.

"ఈ గొడుగు నాదికాదు"

అందరం మళ్ళీ ఆశ్చర్యపోయాం.

"మీది కాదా?"

"కాదండీ! నా ఇనీషయల్స్ ఎమ్. ఎన్. డి. అని వుండాలి."

"మరి పి.యన్.ఎల్. అంటే ఎవరు?" అడిగాడు రెడ్డి అయోమయంగా.

"ఏమో! నాకు తెలీదు."

"చూడమ్మా! ఓ సహాయం చేస్తావా!" నర్సునడిగాడు రెడ్డి ప్రాధేయపడుతూ.

"ఏం చేయమంటారు?"

"ప్రస్తుతానికి ఈ గొడుగు తీసుకెళ్ళిపోండి. ఎప్పటికయినా మీ గొడుగు అడ్రస్ దొరికితే మీకు అప్పజెప్తాను."

"సరే–' అయిష్టంగా తీసుకుని వెళ్ళిపోయిందామె.

"మరి నా పెన్ సంగతేమిటి?" అంది రెండోనర్స్.

"మీ పెన్నేమిటి?" మళ్ళీ ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

"అదేనండి! నాది నూట అరవై రూపాయల పెన్ను! ఇప్పుడే రాసిస్తానని నిన్ను తీసుకుని సాయంత్రం ఈ డొక్కు పెన్ పంపించారు"

"ఆ! ఇది మీది కాదా?"

"కాదు–"

ఈ పరిస్థితిలో మా మధ్యలో ఓ లావుపాటాయన వచ్చి రెడ్డిగారికి ఓ కాసెట్ ఇచ్చాడు.

"ఇది నాది కాదండీ గురూజీ! ఇంకెవరిదో."

నేను ఆత్రుతగా ఆ కాసెట్ తీసుకుని చూశాను.

"అది నీదే గురూ! సందేహం అక్కర్లేదు. తీసుకెళ్ళు" అన్నాడు రెడ్డి నాతో.

"కంపెనీ పేరు కరెక్టే గాని ఇంత మాసిపోయినట్లుందేమిటి?" అడిగాను అనుమానంగా.

"ఆ– మరేం లేదు. ఇక్కడ డస్ట్ అదీ పడి అలా అయిందిలే!"

ఎందుకయినా మంచిదని ఇంటికెళ్ళగానే కాసెట్ టేప్‌రికార్డర్‌లో వుంచి ప్లేచేశాను.

అంతకుముందెప్పుడూ వినని శబ్దాలు వినిపించడం ప్రారంభించేసరికి మతి పోయింది.

కనుక ఈ స్టడీ వల్ల నేను తేల్చుకున్నదేంటంటే మనిషికొకే ఒక్క విషయంలో మతిమరుపుండు మహిలో సుమతి అన్న నగ్నసత్యం.